

... ఆనవాళ్లు కరువు

వైరా రిజర్వాయర్ ఆనకట్టపై రూ.కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్వహణ లోపం కారణంగా ఆనవాళ్లు కోల్పోతున్నాయి. 8లో



భారంగా పచ్చిరొట్ట సాగు

భూసారం పెంచడంలో కీలకమైన పచ్చిరొట్ట విత్తనాల ధర పెరగడమే కాక సరిపడా లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం

39° / 28°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఎండ ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం వేళ వడగాలుల ప్రభావం సైతం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమ, మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం ఖమ్మం గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి ప్రసంగిస్తారు. ఆతర్వాత చింతకానిలో రోడ్డు విస్తరణ పనులకు, సాయంత్రం మధిర మండలం మాటూరులో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, మంగళవారం ఉదయం ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భూభారతి సదస్సులో డిప్యూటీ సీఎం పాల్గొంటారు.

మంత్రి పొంగులేటి...

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 4గంటలకు తిరుమలాయపాలెం మండలంలో రఘునాథపాలెం–గుండెపూడి బీటీ రోడ్డు, గోల్‌తండాలో జింకలగూడెం–మేడిదపల్లి బీటీ రోడ్డు, దమ్మాయిగూడెంలో హైవే నుండి దమ్మాయిగూడెం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, కొక్కిరేణి పాఠశాలలో అదనపు తరగతి గదులకు, గోపాలపురంలో బీటీ రోడ్డు నిర్మాణం, చింతపల్లి నుండి హైవే వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

అడిషనల్ డీసీపీకి ఉత్తమ సేవాపతకం

- మరికొందరికి కూడా పతకాలు



ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగులకు సేవా పతకాలను ప్రకటించింది. ఇందులో భాగంగా ఖమ్మం కమిషనరేట్‌లో పలువురికి ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలు దక్కాయి. ఖమ్మం అడిషనల్ డీసీపీ(లా అండ్ ఆర్డర్) జి.ప్రసాద్‌రావు, ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ చంద్రకళాధర్‌తో పాటు ఇంటెలిజెన్స్ ఎస్సై ఎం.డీ.అక్తర్‌పాషా ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. అలాగే, సేవా పతకాలకు డి.వేణుగోపాల్‌రావు(ఆర్ఎస్ఐ), ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుళ్లు అబ్దుల్ హమీద్(హెచ్‌సీ 2050), ఎస్.డీ.గౌస్(605)త పాటు కె.బుల్లయ్య(హెచ్‌సీ 2132–మధిర టౌన్), ఆర్.కాశహస్తి(హెచ్‌సీ 1784–మధిర రూరల్), ఎస్.కే.మన్సూర్‌అలీ(హెచ్‌సీ 993–ఖమ్మం), బి.నరసింహారావు(హెచ్‌సీ707–డీటీసీ), ఎం.శ్రీనివాసరావు(పీసీ 2022–సత్తుపల్లి)తో పాటు ఎం.శ్రీనివాసరావు(1263–ఇంటెలిజెన్స్), గంగారం 15వ బెటాలియన్ ఆర్ఎస్ఐ డి.లక్ష్మణ్‌కు పతకాలు ఎంపికైనట్లు వెల్లడించారు.

నిత్యావసరాల సరఫరాకు టెండర్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, హాస్టళ్లకు అవసరమైన కోడిగుడ్లు, కూరగాయలు, అరటి పండ్లతో పాటు చికెన్(స్కిన్‌లెస్) సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేల డీడీ చెల్లించి టెండర్ ఫారం తీసుకోవాలని సూచించారు. ఆపై కూరగాయలకు రూ.50 వేలు, పండ్లకు రూ.50 వేలు, కోడిగుడ్లకు రూ.50 వేలు, స్కిన్‌లెస్ చికెన్‌కు రూ.50వేల చొప్పున ధరావత్తు డీడీ రూపంలో చెల్లించి ఈనెల 9వ తేదీలోగా టెండర్లు సమర్పించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ధరావత్తులో 20శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. కాగా, పాన్, టిన్ నంబర్లు, సొంత దుకాణం, బ్యాంకు ఖాతా కలిగిన జిల్లా వాసులు అర్హులని పీఓ తెలిపారు.

30వరకు బియ్యం పంపిణీ



రేషన్ షాప్‌లో పరిశీలిస్తున్న డీసీఎస్‌ఓ

ఖమ్మంఅర్బన్: రేషన్‌షాప్‌ల ద్వారా లబ్ధిదారులకు ఈసారి మూడు నెలలకు సంబంధించి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఆదివారం బియ్యం పంపిణీ మొదలుకాగా, ఆయన పలు రేషన్ షాపుల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఎస్‌ఓ మాట్లాడుతూ కార్డుదారులకు అవసరమైన 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు సిద్ధం చేశామని తెలిపారు. ఈనెలలో 30వ తేదీ వరకు బియ్యం పంపిణీ ఉంటుందని, డీలర్లు సమయ పాలన పాటించాలని సూచించారు. సివిల్ సప్లయీస్ డీటీ హెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

■ **ఖమ్మం సహకారనగర్:** జిల్లాలోని 748 రేషన్ షాప్‌లకు గాను ఆదివారం 509 రేషన్ దుకాణాలు తెరిచారు. ఈమేరకు తొలిరోజు 13,089మంది కార్డుదారులు బియ్యం తీసుకున్నారని డీసీఎస్‌ఓ చందన్‌కుమార్ తెలిపారు.

మరిన్ని బడుల్లో ఏఐ



రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు అనేక ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా గత విద్యాసంవత్సరం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత బోధన సాగించారు. జిలాల్లోని ఏడు పాఠశాలల్లో ఈ విధానం అమలుచేయగా సత్ఫలితాలు వచ్చాయని ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో ఈ విద్యాసంవత్సరం ఇంకా 176 పాఠశాలల్లో అమలుకు నిర్ణయించారు. – ఖమ్మం సహకారనగర్

ఎన్నెస్పీకాలనీ పాఠశాలలో ఏఐ బోధనను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ (ఫైల్)

- గత ఏడాది ఏడు పాఠశాలల్లో అమలు
- విద్యార్థుల ఉత్సాహం.. మెరుగైన ఫలితాలు
- ఈసారి కొత్తగా 176స్కూళ్లలో ఏర్పాటుకు నిర్ణయం

ఈ ఏడాది అమలు చేయనున్న స్కూళ్ల వివరాలు

నియోజకవర్గం	పీఎస్‌లు	యూపీఎస్‌లు	మొత్తం పాఠశాలలు
పాలేరు	40	08	48
మధిర	35	03	38
ఖమ్మం	35	02	37
వైరా	23	05	28
సత్తుపల్లి	21	04	25
మొత్తం	154	22	176

అమలు ఇలా..

పేరున్న కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రమే ఏఐ ఆధారిత బోధన కొనసాగుతోంది. దీన్ని గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్, గణిత సామర్థ్యాలు పెంచేలా అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రయోగాత్మకంగా జిల్లాలోని ఏడు పాఠశాలలకు కంప్యూటర్లు సమకూర్చి 3 నుంచి 5 తరగతుల్లో పదేసి మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఆపై 'ఏక్ స్టెప్' ఫౌండేషన్ రూపొందించిన ప్రోగ్రాం ఆధారంగా రోజుకు 40 నిమిషాలు, వారానికి నాలుగు రోజులు కంప్యూటర్లతో బోధించారు. తద్వారా ప్రతీ విద్యార్థి కంప్యూటర్‌ను వినియోగిస్తూ ఉచ్ఛారణను రికార్డు చేయడమే కాక ఆపై మళ్లీ వింటూ తప్పొప్పులు సరిచేసుకున్నారు. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ, రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలు, మల్లెమడుగు, పాండురంగాపురం, సింగారెడ్డిపాలెం, సత్తుపల్లి, సిద్ధారంలోని మండల పరిషత్ పాఠశాలల్లో ఈ విధానం అమలుచేయగా విద్యార్థుల సామర్థ్యాలు పెరిగినట్లు గుర్తించారు.

తల్లిదండ్రులకు నివేదికలు

గత ఏడాది ఏఐ ఆధారిత బోధన సాగిన పాఠశాలల్లోని విద్యార్థుల ప్రగతిని రెండు సార్లు తల్లిదండ్రులకు అందించారు. ఈ విషయంలో సానుకూల స్పందన వచ్చింది. అంతేకాక ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో నిలవగా ఉన్నతాధికారులు డీఈఓ సామినేని సత్యనారాయణకు ప్రశంసాపత్రం అందించారు. దీంతో ఈ ఏడాది 50కి మించి విద్యార్థులు ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఐదు చొప్పున కంప్యూటర్లు కేటాయించి విస్తరించాలని నిర్ణయించారు.

కలెక్టర్ ప్రత్యేక చొరవ

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధనపై ప్రత్యేకదృష్టి సారించారు. జిల్లా కేంద్రంలోని ఎన్నెస్పీ కాలనీ పాఠశాలలో కొత్త విధానం అమలును తరచుగా పర్యవేక్షించిన ఆయన అధికారులకు సూచనలు చేశారు. దీంతో కార్యక్రమం సమర్థవంతంగా అమలైంది.

ఇవీ లాభాలు

ఏఐ ఆధారిత బోధన ద్వారా తెరపై చూస్తూ పాఠాలు వింటుండడంతో విద్యార్థులకు ఎక్కువ కాలం గుర్తుంచుకునేలా దోహదపడుతుందని భావిస్తున్నారు. అలాగే, కంప్యూటర్ విద్యపై భయం తగ్గుతుందని.. వెనకబడిన విద్యార్థులు సైతం చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, గుణకారాలు సులభంగా నేర్చుకున్నారని తేలింది. తెలివితేటలు, ఏకాగ్రత పెరిగి విద్యార్థులు పాఠశాలలకు రావడానికి ఆసక్తి కనబరుస్తున్నారని గుర్తించారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపు



కంప్యూటర్ ఆధారిత బోధనతో విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగయ్యాయి. పాఠశాలకు క్రమం తప్పకుండా రావడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పిల్లలు కంప్యూటర్ వినియోగిస్తుండడంతో తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

– కె.రవికుమార్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి

176 పాఠశాలల్లో ఏర్పాట్లు



జిల్లాలోని 176 పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత బోధన మొదలుపెడుతున్నాం. ఇప్పటికే అమలుచేసిన స్కూళ్లలో సత్ఫలితాలు వచ్చాయి. దీంతో మరిన్ని పాఠశాలలకు విస్తరిస్తున్నాం.

– సామినేని సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి



సింగారెడ్డిపాలెంలో కంప్యూటర్‌పై పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)

త్వరలోనే హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్



అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలో హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకానుంది. ఇన్నాళ్లు కాల్వొడ్డు తదితర ప్రాంతాల్లో పండ్లు అమ్ముతుండగా అమ్మకందారులే కాక ప్రజలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈనేపథ్యాన నగరంలోని 4వ డివిజన్ పారిశ్రామిక ప్రాంతంలో మూడేళ్ల నుంచి అసంపూర్తి నిర్మాణాలతో ఖాళీగా ఉన్న వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ షెడ్లను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. కొద్దిమేర మిగిలి ఉన్న పనులు పూర్తిచేసి హోల్‌సెల్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇది అమల్లోకి వస్తే నగరవాసులకు అన్ని రకాల పండ్లు ఒకే చోట లభించనున్నాయి. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా పనులు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా కేంద్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రణాళికాయుతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. రహదారులపై ర్యాంప్‌ల నిర్మాణం, ఆక్రమణతో వెడల్పు తగ్గి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అయితే, అధికారులు తొలిదశలో అడ్డుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. కాగా, వర్షాలు పడేనాటికి ఇరిగేషన్ పనులు పూర్తిచేయాలని, విద్యుత్ లైన్ల ఏర్పాటులో ఉద్యోగులు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తికి శ్రీకారం

- రైతులకు 'ఫౌండేషన్ సీడ్' పంపిణీ
- జిల్లాలోని 379 గ్రామాల్లో ముగ్గురేసి రైతుకు వరి, పెసర విత్తనాలు
- నేడు పంపిణీకి సిద్ధం చేసిన యంత్రాంగం



రైతులకు పంపిణీ చేయనున్న విత్తనాల బ్యాగ్

ఖమ్మంవ్యవసాయం: మెరుగైన విత్తనోత్పత్తే లక్ష్యంగా రైతులకు ఫౌండేషన్ సీడ్(పునాది విత్తనం) పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన రైతులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం వీటిని అందించనున్నారు. జిల్లాలోని 379 రెవెన్యూ గ్రామాల్లో ముగ్గురు చొప్పున రైతులకు వరి, పెసర విత్తనాలను పంపిణీ చేసేలా జిల్లా వ్యవసాయ శాఖ, వైరా కేవీకే ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. వరి డబ్ల్యూజీఎల్–44 సన్న రకం, పెసర ఎంజీజీ– 385 రకాలను అందిస్తారు. వరి విత్తనాలను ఒక్కో రెవెన్యూ గ్రామంలో ఇద్దరికి చొప్పున 758 మందికి, పెసలు ఒక్కొక్కరు చొప్పున 379 మంది రైతులకు అందించాలని నిర్ణయించారు.

నాణ్యమైన విత్తనాల కోసం..

రైతులు ఏటా విత్తనాలు కొనుగోలు చేయకుండా సొంతంగా విత్తనోత్పత్తి చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా రైతులు సొంత అవసరాలకు వాడుకోవడమే కాక గ్రామాల్లో ఇతరులకు అమ్ముకోవడం ద్వారా ఆదాయం లభిస్తుందని భావనకు వచ్చినట్లు తెలిసింది. ఇందులో భాగంగా రైతుల ద్వారా విత్తనోత్పత్తి చేసేలా ప్రభుత్వం ఫౌండేషన్ సీడ్ పంపిణీకి శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల ద్వారా విత్తనాలు విక్రయించడం కంటే రైతులే విత్తనోత్పత్తి చేసేలా ప్రోత్సహించేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. తద్వారా నకిలీ విత్తనాల బారిన పడకుండా అడ్డుకట్ట వేసే అవకాశముంది. అలాగే, రైతులు సాగు చేసే పంటను అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి అవగాహన కల్పిస్తేఅందరికీ మేలు జరగనుంది. ఈ రకంగా మూడేళ్ల పాటు విత్తనోత్పత్తి చేయించేలా ఫౌండేషన్ విత్తనాలు పంపిణీ చేయనున్నారు.

ఆవిర్భావ వేడుకలకు ముస్తాబు

నేడు జెండా ఆవిష్కరించనున్న డిప్యూటీ సీఎం భట్టి


ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. ఉదయం 10గంటలకు మైదానంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జెండా ఆవిష్కరించనున్నారు. ఆయన ప్రసంగం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈమేరకు స్టాళ్ల ఏర్పాటు, ఇతర పనులు ఆదివారం సాయంత్రానికి ముగిశాయి. ఇక కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఉదయం 8–30గంటలకు జెండా ఆవిష్కరిస్తారు.

నియోజకవర్గ కేంద్రాల్లోనూ...

ఈసారి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోనే కాక అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం 4గంటలకు ఎమ్మెల్యేల ఆధ్వర్యాన ఈ వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. సత్తుపల్లిలోని రాణి ఫంక్షన్ హాల్, వైరాలోని కమ్మవారి కల్యాణ మండపం, మధిరలోని రిక్రియేషన్ క్లబ్, ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రం, పాలేరు నియోజకకవర్గానికి సంబంధించి టీసీవీ.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో వేడుకలు జరగనుండగా, వివిధ పథకాల లబ్ధిదారులకు ఎమ్మెల్యేలు మంజూరు పత్రాలు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిని రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ వారం రద్దు చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్న ఉద్యోగులు

సాగుకు మరింత నీరు

- బుగ్గవాగు చెక్‌డ్యాం నుంచి పైపులైన్ల ఏర్పాటుకు ప్రణాళిక
- రూ.82కోట్ల బడ్జెట్‌తో ప్రభుత్వానికి ప్రతిపాదన
- అమలైతే 5,500 ఎకరాలకు సజావుగా సాగునీరు

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో సాగునీటి కష్టాలు తీర్చేలా కొత్త పథకం తెరపైకి వచ్చింది. కారేపల్లి – కామేపల్లి మండలాల సరిహద్దుల్లో బుగ్గవాగుపై ఏళ్ల క్రితమే చెక్‌డ్యాం నిర్మించగా.. గ్రావిటీ కాల్వల నిర్మాణానికి భూసేకరణ ఇబ్బందిగా మారడంతో ఫలితం దక్కలేదు. ఇటీవల రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వపై నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం నుంచి పైపులైన్ల ద్వారా 33 చెరువులకు సాగునీరు మళ్లించగా విజయవంతమైంది. ఇదే తరహాలో చెక్‌డ్యాం నుంచి పైపులైన్లు వేసి చెరువులకు నీరు మళ్లించాలని ప్రతిపాదించిన జల వనరుల శాఖ అధికారులు రూ.82 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించినట్లు తెలిసింది.

పదేళ్ల క్రితమే నిర్మాణం

బుగ్గవాగుపై పదేళ్ల క్రితమే చెక్‌డ్యామ్ నిర్మించారు. ఆతర్వాత గ్రావిటీ కాల్వల ద్వారా చెరువులకు నీరు తరలించాలని భావించారు. ఇందుకోసం సుమారు రూ.40 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా... భూసేకరణలో విలువైన భూములు కోల్పోతున్నామని రైతులు వ్యతిరేకించారు. దీనికితోడు మరి కొన్ని సమస్యలతో పథకం ముందుకు సాగలేదు.

'మంచుకొండ' సక్సెస్

బుగ్గవాగు చెక్‌డ్యాం నుంచి నీరు తరలించేందుకు ఎక్కువ భూసేకరణ అవసరం లేకుండా ప్రత్యామ్నాయంపై అధికారులు ఆలోచన చేశారు. ఇటీవల రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో సాగర్ ప్రధాన కాల్వపై నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం నుంచి పైపులైన్ల ద్వారా 33 చెరువులకు సాగునీరు విడుదల చేశారు. ఇది సత్ఫలితాలను ఇవ్వడంతో అధికారులు బుగ్గవాగు చెక్‌డ్యాంపై దృష్టి సారించారు. మంచుకొండ మాదిరిగానే పైపులైన్లు నిర్మిస్తే తక్కువ భూసేకరణ, వ్యయంతో పని పూర్తవుతుందనే నిర్ణయానికి వచ్చారు.



మంచుకొండ లిఫ్ట్ నుంచి పైపులైన్ ద్వారా చెరువులోకి చేరుతున్న నీరు (ఫైల్)



సాగర్ జలాలతో నిండిన మంచుకొండ చెరువు

26 కి.మీ.. 200 క్యూసెక్కులు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో సుమారు 26 కి.మీ. మేర పైపులైన్ నిర్మాణం, భూసేకరణ, ఇతర పనులకు రూ.82కోట్లు అవసరమని జల వనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. ఇది అమలైతే కామేపల్లి మండలంలోని 21, రఘునాథపాలెం మండలంలోని 10 చెరువులకు కలిపి 31 చెరువులకు పైపులైన్ ద్వారా నీరు అందుతుంది. సుమారు 200 క్యూసెక్కుల నీటిని తరలించడం ద్వారా దాదాపు 5,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని, సమీప ప్రాంతాల్లో భూగర్భజలాలు మెరుగుపడతాయని.. తాగునీటి సమస్యకు సైతం పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు. వర్షాకాలంలో వాగుల ద్వారా వచ్చే నీటిని చెక్‌డ్యామ్‌లో నిలిపి.. ఆపై చెరువులకు తరలిస్తే పంట సాగు చివరి దశలో ఇబ్బందులు ఎదురుకావని భావిస్తున్నారు. కాగా, మంచుకొండ లిఫ్ట్ ద్వారా రఘునాథపాలెం మండలంలోని పలు చెరువులకు సాగర్ జలాలు విడుదల చేయగా, మిగతా చెరువులకు బుగ్గవాగు చెక్‌డ్యాం నుంచి నీరు అందనుండడంతో మండలంలో సాగునీటి కష్టాలు తీరుతాయని చెబుతున్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భక్తులతో పోటెత్తిన భద్రగిరి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకుంటుండడం, ఆదివారం కావడంతో భద్రగిరి భక్తులతో పోటెత్తింది. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన పిదప స్వామి దర్శనానికి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. దీంతో దేవస్థాన ప్రాంగణం సందడిగా మారింది.



రామయ్య దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

ఐఎఫ్ఎస్‌గా భరత్ స్కూల్ పూర్వ విద్యార్థి ఎంపిక



గోపీనాథ్‌ను అభినందిస్తున్న వెంకటరెడ్డి

మధిర: మధిరలోని భరత్ టెక్నో స్కూల్ పూర్వ విద్యార్థి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం రామిరెడ్డిపల్లికి చెందిన ఆలపాటి గోపీనాథ్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఓసీ కేటగిరీ నుంచి 55వ ర్యాంకు సాధించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా ఆదివారం ఆయనను స్కూల్ చైర్మన్ శీలం వెంకటరెడ్డి సన్మానించారు. భరత్ విద్యానికేతన్‌లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివిన గోపీనాథ్ ఐఎఫ్ఎస్‌కు ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ నెట్‌బాల్ టోర్నీలో కాంస్య పతకం



వి.హర్షిణి

ఖమ్మం స్పోర్ట్స్: మధ్యప్రదేశ్‌లో ఇటీవల జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ఖమ్మం రూరల్ పెద్ద వెంకటగిరికి చెందిన వి.హర్షిణి కాంస్య పతకం దక్కించుకుంది. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆమె ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా హర్షిణిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సీహెచ్.దీప్తి, కార్యదర్శి ఎన్.ఫణికుమార్, కోచ్‌లు పీ.పీ.రమణ, అఖిల్‌కుమార్ అభినందించారు.

అధ్యాపకుల నిరసన

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని నూతన అధ్యాపకులకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ విషయంలో కొందరు కుట్ర పన్నారని పేర్కొంటూ అధ్యాపకులు నిరసన తెలిపారు. ఈమేరకు ఖమ్మంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో వాల్యుయేషన్ కేంద్రం వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్–475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడగా బాధ్యులు బేగం, మల్లయ్య, కిషోర్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలల్లో చేరొద్దు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థినీ, విద్యార్థులు ఇంటర్‌మీడియట్‌లో చేరే క్రమాన కళాశాలల అనుమతులు సరిచూసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. అకాడమీలు, ట్యూషన్ సెంటర్లకు ఎలాంటి అనుమతులు ఉండవని వెల్లడించారు. ఈనేపథ్యాన ప్రభుత్వ అనుమతులు పరిశీలించాకే చేరాలని.. తద్వారా నష్టం జరగదని పేర్కొన్నారు. ఈమేరకు కళాశాలల గుర్తింపు వివరాలను tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో చూడొచ్చని డీఐఈఓ తెలిపారు. కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నందున విద్యార్థులు హాజరుకావాలని ఆయన సూచించారు.

భారజల కర్మాగారం జీఎంగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారం జీఎంగా ఘంటసాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రస్తుత జీఎం హెచ్‌కే.శర్మ ఉద్యోగ విరమణ చేయడంతో డీజీఎంగా పని చేస్తున్న శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రూ.5 కోట్ల పనులు.. ఆనవాళ్లు కరువు

వైరా రిజర్వాయర్ ఆనకట్టకు పగుళ్లు

- ట్యాంక్‌బండ్ పనుల్లోనూ అదే పరిస్థితి
- ఆసక్తిగా వస్తున్న స్థానికులు, పర్యాటకులకు నిరాశ





ఆనకట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు (ఇన్‌సెట్) ప్యానెల్ ఎత్తుకుపోవడంతో మిగిలిన లైట్

వైరా: వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన వైరా రిజర్వాయర్ ఆనకట్ట రూపురేఖలు కోల్పోతోంది. నైజాంల కాలం నిర్మించిన ఈ రిజర్వాయర్‌కు జిల్లాలోనే ప్రాధాన్యత ఉంది. కానీ అటు అధికారుల, ఇటు పాలకుల పట్టింపులేని తనంతో ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వైరా రిజర్వాయర్ ఆనకట్ట అభివృద్ధికి 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5.30 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 2.5 మీటర్లు ఉన్న ఆనకట్టను 8మీటర్లుగా వెడల్పు చేయడంతో పాటు బతుకమ్మ ఘాట్, 2.5 కి.మీ. మేర ఆనకట్టపై రెయిలింగ్ ఏర్పాటుచేసి, లాన్ తీర్చిదిద్దారు. అంతేకాక కట్ట పొడవున సోలార్ లైట్లు ఏర్పాటు చేయగా.. ఇప్పుడు అవేమీ కానరావడం లేదు. అటు రిజర్వాయర్, ఇటు మినీ ట్యాంకు బండ్‌గా పేరున్నా సేద తీరాలని వచ్చే వారికి అసౌకర్యాలు అడుగడుగునా అడ్డుపడుతున్నాయి.

దెబ్బతిన్న రెయిలింగ్

రిజర్వాయర్ ఆనకట్టను సుమారు వందేళ్ల క్రితం నిర్మించినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కానీ 2019 సంవత్సరంలో చేపట్టిన పనులు ఐదేళ్లు దాటక ముందే నాణ్యతాలోపంతో దెబ్బతింటున్నాయి. ఇప్పటికే అర కిలో మీటర్‌కు పైగా ఆనకట్టుకు రెయిలింగ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇదిలాగే వదిలేస్తే ప్రమాదకర స్థాయికి చేరే అవకాశముంది. ఇక ఆనకట్టపై రూ.20లక్షలు వెచ్చించి పచ్చటి గడ్డితో తీర్చిదిద్దిన లాన్ సైతం ఆనవాళ్లు కోల్పోయి పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది.

కానరాని సోలార్ లైట్లు, ప్యానళ్లు

రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా నిర్వహణ లోపంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడేళ్ల క్రితం రూ. 35 లక్షలతో 2.5 కి.మీ. పొడవులో 73 సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. కానీ చాలా వాటి బ్యాటరీలు, ప్యానెళ్లు, లైట్లు చోరీ కావడంతో ఇప్పుడు పదికి మించి లైట్లు వెలగడం లేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులిపేసుకున్న అధికారులు కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో సాయంత్రం వేళ ఆనకట్టపైకి వచ్చే పర్యాటకులు, వాకర్లు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయాన ఆకతాయిల తీరుతో మహిళలకు అవస్థ ఎదురవుతోంది. అంతేకాక బతుకమ్మ ఘాట్ మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం వేళ ఇక్కడ మద్యం సేవిస్తున్న పలువురు బాటిళ్లు పగుల గొట్టి వదిలేస్తుండడం గమనార్హం.

పర్యవేక్షణ లోపంతోనే..

రిజర్వాయర్ ఆనకట్ట పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం పొందినా అటు నీటి పారుదల శాఖ, మున్సిపల్, పర్యాటక శాఖ అధికారులెవరూ పట్టించుకోకపోవడం లేదు. ఫలితంగా నిర్వహణ లోపంతో ఆనవాళ్లు కోల్పోతుంది. సాయంత్రమైనా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తే ఆకతాయిలకు అడ్డుకట్ట పడుతుంది. అలాగే, రెయిలింగ్ పగుళ్ల వద్ద మరమ్మతులు చేసి, పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా తీర్చిదిద్దాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

మరమ్మతులు చేపడతాం..

రిజర్వాయర్ ఆనకట్ట రెయిలింగ్‌కు పగుళ్లు వచ్చిన చోట మరమ్మతు చేయిస్తాం. అలాగే, మున్సిపల్ అధికారులతో మాట్లాడి పిచ్చి మొక్కలు తీయించడమే కాక పూల మొక్కలు నాటుతాం. ఆనకట్టను మరింత అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు రూపొందిస్తాం. – శ్రీనివాస్, ఐబీ, డీఈ

భారంగా పచ్చిరొట్ట సాగు

- గత ఏడాదితో పోలిస్తే విత్తనాల ధర రెట్టింపు
- సరఫరా సైతం నామమాత్రంగానే...
- ఉత్పత్తి సరిపడా లేకపోవడంతోనే ఈ పరిస్థితి



పచ్చిరొట్ట పంటను కలియదున్నుతున్న రైతు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: భూసారాన్ని పెంచేలా రైతులు సాగుచేసే పచ్చిరొట్ట విత్తన ధరలు అమాంతం పెరిగాయి. గత ఏడాదితో రెట్టింపు కావడం గమనార్హం. ఏకంగా ఒక్కో విత్తన బ్యాగ్‌పై రూ.వేయికి పైగా ధర పెరిగినా.. సరిపడా అందుబాటులో లేకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు తొలకరి వర్షాలు కురవగానే భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేస్తారు. ఈ పైరు పెరిగాక భూమిలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరి సాగు చేసే మాగాణి భూముల్లోనే కాక మిర్చి, పండ్ల తోటల్లో భూముల్లో పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము, పిల్లి పెసర సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

అంతకు మించి...

పచ్చిరొట్ట విత్తనాల ధరలు గత ఏడాదితో పోలిస్తే రెట్టింపయ్యాయి. గత ఏడాది కిలో జీలుగుల ధర రూ.37.20 కాగా, ఈ ఏడాది రూ.71.25కు చేరింది. జనుము గత ఏడాది రూ.36.20 ఉంటే రూ.62.75, పిల్లి పెసర గత ఏడాది రూ.54.20 కాగా ఈ ఏడాది రూ.102.50గా నిర్ణయించారు. ఈ విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నా రైతులు భారం మోయలేకపోతున్నారు.

అంతంతే సరఫరా

ఈ ఏడాది పచ్చిరొట్ట విత్తనాల సరఫరా కూడా అంతంత మాత్రంగానే ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు డిమాండ్ మేరకు విత్తనాభివృద్ధి సంస్థకు ఇండెంట్ ఇస్తాయి. ఆపై విత్తనాభివృద్ధి సంస్థ పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో తీసుకొస్తుంది. ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల అధికారులు జీలుగులు 19వేల క్వింటాళ్లు, జనుము 1,900 క్వింటాళ్లు, పిల్లి పెసర 200 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు సమర్పించారు. ఇందులో జీలుగు 3,252 క్వింటళ్లు, జనుము 1,170 క్వింటాళ్లే అందుబాటులోకి వచ్చాయి. ఇక పిల్లి పెసర విత్తనాల జాడే లేదు. గత ఏడాది జీలుగులు 15,229 క్వింటాళ్లు, జనుము 1,172 క్వింటాళ్లు, పిల్లి పెసర 171 క్వింటాళ్లు పంపిణీ చేశారు. కానీ ఈసారి తక్కువగా అందుబాటులో రావడంతో రైతులందరికీ అందకపోగా.. , ధర పెరిగిన నేపథ్యాన కొందరు సాగుపై నిర్లిప్తత కనబరుస్తున్నారు.

ఉత్తరాది నుంచి దిగుమతి

పచ్చిరొట్ట పంటలను ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సాగు చేస్తారు. ఢిల్లీ పరిసర రాష్ట్రాల్లోనే కాక బిహార్‌లో ఈ పంటలే సాగవుతున్నాయి. కానీ ఈ ఏడాది పచ్చిరొట్ల పంటల దిగుబడి తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తద్వారా ధరలపైనే కాక లభ్యతపై ప్రభావం పడిందని విశ్లేషిస్తున్నారు. ఏదిఏమైనా విత్తన ధరలు పెరగడం, సరఫరా తగ్గడంతో ఈ ఏడాది పచ్చిరొట్ట సాగు సైతం తగ్గుతుందని చెబుతున్నారు. ఫలితంగా రసాయన ఎరువుల వినియోగం పెరిగే అవకాశముంది.

పచ్చిరొట్ట విత్తనాల ధరలు (రూ.ల్లో)

విత్తనం	కిలోలు	గత ఏడాది	ఈ ఏడాది	పెంపు
జీలుగు	30	1,116	2,137	1,021
జనుము	40	1,448	2,510	1,062
పిల్లిపెసర	30	1,084	2,055	971

‘ఈ దేశ మూలవాసులం మనమే..’



మాట్లాడుతున్న శ్రీధర్

ఖమ్మం మామిళ్లగూడెం: ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలే కాక మతం మార్చుకున్న ముస్లిం మైనార్టీలు కూడా ఈ దేశ మూలవాసులేనన్న అంశం శాస్త్రీయంగా నిరూపితమైందని బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు నల్లా శ్రీధర్ తెలిపారు. సంఖ్యాపరంగా అధిక సంఖ్యలోనే ఉన్నా బానిసలుగా, బాధితులుగా మిగిలిపోవడంతో విద్య నుండి దూరమయ్యామని చెప్పారు. ఖమ్మం టీటీడీసీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇతర దేశాల నుండి వలస వచ్చిన ఆర్యులు ఇక్కడి జీవన విధానం, నాగరికతను ధ్వంసం చేసి ఎవరూ తిరగబడకుండా కుల వ్యవస్థ, మనుధర్మాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈమేరకు అందరూ చరిత్రను చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయకుమారి మాట్లాడుతూ మాతస్వామిక తత్వంతో జీవించగా, స్త్రీలకు విలువలు లేని మనుధర్మ శాస్త్రం, కులాన్ని రుద్దడం ద్వారా రాజ్యాధికారానికి దూరం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో తొలుత సామాజిక ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బామ్‌సెఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా పెద్దన్నతో పాటు వివిధ సంఘాల నాయకులు భూక్యా ఉపేంద్రబాయి, షేక్ నజీమా, ప్రమీల, త్రివేణి, భవాని, సరోజిని, బానోతు భద్రునాయక్, మీగడ రామారావు, రవి, సోమ్లా, సంజీవరావు, పగిడిపల్లి నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ.. వదిలేసి ఇంకొకటి...

వైరా: ఇంటి ముందు నిలిపిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లి ఆ స్థానంలో ఇంకో చోట చోరీ చేసిన వాహనాన్ని ఉంచిన ఘటన ఇది. వైరా సంతబజార్‌కు చెందిన మున్సిపాలిటీ ఉద్యోగి వెంకటకృష్ణ ఇంటి ముందు నిలిపిన వాహనం చోరీ జరిగింది. అయితే, ఆ స్థానంలో మరో వాహనం ఉంది. అది ఎవరిదని ఆరా తీస్తే వైరాలోని ఓ టీస్టాల్ యజమానిదిగా తేలింది. అయితే, ఆ వాహనాన్ని చోరీ చేసిన దుండగులు ఇక్కడ వదిలేసి వెంకటకృష్ణ వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు భావిస్తున్నారు. ఈమేరకు ఎస్ఐ రామారావు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎస్‌టీఎఫ్ నాయకులు



డిప్యూటీ సీఎంకు చిత్రపటం అందిస్తున్న ఎస్‌టీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లతో విద్యార్థులకు మేలు జరగడమే కాక విద్యారంగానికి దిక్సూచిలా నిలుస్తాయని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు పేర్కొన్నారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఆదివారం ఆయన పలువురు ఎస్‌టీఎఫ్ బాధ్యులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. ఈమేరకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ చిత్రపటాన్ని అందజేసి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే కాక అగ్రవర్ణాల్లోని పేద పిల్లలకు ఉత్తమ విద్య అందేలా స్కూళ్లు ఏర్పాటు చేస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఆస్తుల కన్నా.. పర్యావరణం మిన్న

వన మహోత్సవంలో మొక్కలు నాటిన సీఎండీ



నాటిన మొక్క వద్ద సీఎండీ బలరామ్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రపంచంలో అన్నింటికీ హద్దులు ఉన్నా.. గాలి, వెలుతురు, ఆక్సిజన్‌కు లేవని, అందుకే ఆస్తుల కంటే పర్యావరణమే ముఖ్యమని గుర్తించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీ డంప్‌యార్డ్ వద్ద ఆదివారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 121 మొక్కలు నాటారు. దీంతో తాను ఇప్పటివరకు 19,121 మొక్కలు నాటానని, వచ్చే జూలై చివరి నాటికి మరో 1,879 మొక్కలు నాటి.. 21వేల లక్ష్యాన్ని చేరాల్సి ఉందని వివరించారు. ఒక మొక్క ద్వారా రూ. కోటి విలువైన ఆక్సిజన్ ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది సింగరేణి ఆధ్వర్యంలో 40 లక్షల మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్.వీ.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఏరియా జీఎం శాలేం రాజు, అటవీ, పర్యావరణ శాఖ సలహాదారు మోహన్ చంద్ర పరిగెన్, పర్యావరణ జీఎం సైదులు, జీకేఓసీ పీఓ రమేష్, సూర్యనారాయణతో పాటు ఎండీ రజాక్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఒడి బియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు అన్నప్రాసన జరిపించారు. వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ వ్యక్తిని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన వ్యక్తి లేజర్ 24/7 క్లబ్ వెబ్‌సైట్ ద్వారా మ్యాచ్‌లపై ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టిన నిందితుడిని అరెస్ట్ చేసి రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ రవి తెలిపారు. అలాగే, రూ.32 వేల మేర బెట్టింగ్ లావాదేవీలను గుర్తించామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడని తెలిపారు. కాగా, నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం ఖమ్మం అర్బన్ పోలీసులకు అప్పగించామని వెల్లడించారు.

తగ్గిన ఆయిల్‌పామ్ ధర

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ గెలల ధర మరోసారి తగ్గింది. గడిచిన నెలలో స్వల్పంగా తగ్గిన ధర, తాజాగా టన్నుకు ఏకంగా రూ.1,310కు దిగజారింది. ఆదివారం ఆయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ధర నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం తాజాగా టన్ను ధరను రూ.18,748గా ప్రకటించినట్లు ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మందుపాతరలు నిర్వీర్యం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. బలగాలను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో మావోలు ఏర్పాటు చేసిన 10 శక్తిమంతమైన మందుపాతరలను ఆదివారం గుర్తించి నిర్వీర్యం చేశారు. ఈ ఘటన కోహిమెట్టా పోలీస్ స్టేషన్ పరిధి కుతుల్ సీఆర్‌పీఎఫ్ క్యాంపు సమీపంలోని కొడ్మార్–గుర్రా గ్రామాల శివారు అటవీ మార్గంలో జరిగింది. మందుపాతరలను నిర్వీర్యం చేయడంతో పోలీసు బలగాలకు పెను ప్రమాదం తప్పింది. కాగా ఆ ప్రాంతంలో మరిన్ని మందుపాతరలు ఉన్నాయనే అనుమానంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

రాయితీపై ఫైబర్ గడలు

దమ్మపేట : పామాయిల్ గెలల కోతకు వినియోగించే ఫైబర్ గడలను ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై అందజేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని గండుగులపల్లిలోని తన నివాసంలో పలువురు రైతులు కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎత్తయిన పామాయిల్ చెట్ల గెలలు కోసే క్రమంలో విద్యుత్ షాక్ తగలకుండా ఫైబర్ గడలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, వసంతరావు, అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

ఏదీ కారుణ్యం?

- జెన్‌కోలో కారుణ్య నియామకాల్లో తీవ్ర జాప్యం
- మూడేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూపులు
- కేటీపీఎస్‌లో సుమారు 76 మంది బాధితులు



కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. కర్మాగారాల్లో నిత్యం కాలుష్యం అధికంగా ఉండే రెడ్‌జోన్ పరిధిలో కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో అనేక ప్రాణాంతక వ్యాధులకు గురై అనారోగ్యంతో బాధపడుతుంటారు. వ్యాధులు, ప్రమాదాలతోపాటు అకాల మరణాలు చెందిన అనేక మంది ఉద్యోగుల కుటుంబాలకు దక్కాల్సిన కారుణ్య నియామకాలపై జెన్‌కో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఉద్యమాలు చేస్తున్నా తాత్సారం చేస్తోంది. జెన్‌కో వ్యాప్తంగా సుమారు 110 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తుండగా, కేవలం కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలోనే సుమారు 76 మంది వరకు ఉన్నట్లు కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

బాధితుల ఎదురుచూపులు

ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సంస్థల్లో జాప్యం లేకుండా కారుణ్య నియామకాలు చేపడుతున్నారు. జెన్‌కోలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. సీఎండీలు మారడం, డైరెక్టర్ స్థాయి పోస్టులు ఖాళీగా ఉండటం, ప్రభుత్వం మారడం వంటి పరిణామాలతో మూడేళ్లుగా ఈ ప్రక్రియ మందగించింది. దీంతో విధుల్లో చేరేందుకు ఎదురుచూస్తున్న బాధిత కుటుంబీకులు మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో ఉద్యోగాలు ఇప్పించేందుకు పైరవీల పేరుతో బాధితుల నుంచి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగాలు వెంటనే ఇస్తే ఎక్కువ కాలం విధులు నిర్వర్తించే చేసే అవకాశం, సీనియారిటీ పెరిగి అధిక వేతనం వచ్చే అవకాశం ఉంటుంది. కానీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల నష్టపోతున్నట్లు పలువురు వాపోతున్నారు.

వర్తించని జీపీఎఫ్

1999 నుంచి 2004 మధ్యలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తించడం లేదు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి పెన్షన్ ఇవ్వాలని ఉద్యోగాలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమస్యపై కూడా ఉద్యోగ సంఘాలు ఉద్యమాలు చేపట్టాయి. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, కారుణ్య నియామకాల కోసం, జీపీఎఫ్ కోసం తగిన చర్యలు చేపట్టాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాడ్ చేస్తున్నాయి.